# రూబీ నర్సింగ్‌హోమ్

రాత్రి పదిగంటల సమయం.

రూబీ నర్సింగ్‌హోము హాల్లో పెద్ద దీపమొక్కటే వెలుగుతున్నది.

నాలుగో గదిలోఉన్న రోగికి నిద్రపట్టటంలేదు. అతడికి ఇచ్చిన నిద్ర మాత్ర నాలుగుగంటలసేపయినా పనిచేయలేదు. అతడి పరిస్థితి పక్కమీద యథేచ్ఛగా దొర్లటానికి కూడా వీలులేనిది. కుడిభుజం దగ్గర ఎముక ఫ్రాక్చ రయింది. ప్లాసరు వేశారు. చెయ్యి ఇటూ అటూ కదలకుండా మెడదగ్గర వదులుగా పట్టీకట్టి మోచేతివరకూ దానిలోకి దూర్చారు. ఎంతసేపటికీ వెల్లకిలా పడుకోవాలి. ఎడమవైపుకు తిరిగి పడుకోవాలంటే కుడిచెయ్యి విలవిల్లాడిపోతున్నది.

ఇక సహించలేక మూలగటం మొదలుపెట్టాడు.

సిస్టర్ మిస్‌రూబీ వస్తున్నట్టుగా బూట్లశబ్దం వినబడగానే మూలగకుండా ఉండాలని ప్రయత్నిస్తున్నాడు. కాని, ఆపుకోలేకపోతున్నాడు.

ఆమె పరదా తొలగించి లోపలికిచూస్తూ "ఏం మిస్టర్ నిద్రపట్టలేదా?" అడిగింది.

"లేదు సిస్టర్, బాధ భరించలేకుండా ఉన్నాను."

"ఇవాళేకదా ప్లాస్టర్ వేసింది? బాధ కొన్నాళ్ళుంటుంది. తరువాత క్రమంగా తగ్గిపోతుంది. నిద్రమాత్రలు ఎక్కువ వేసుకోకూడదు. అయినా మదర్‌ని అడిగి వస్తాను, ఏమంటుందో?"

ఆమె ఆ లైనులోఉన్న పదిగదులలోకి వెళ్ళి చూసింది. కొందరు నిద్రపోతున్నారు. కొందరు పక్కలమీద మసులుతున్నారు. చివరిగదిలో పడుకున్న ఒక అమ్మాయి కడుపుపట్టుకుని ఇటూ అటూ దొర్లుతున్నది. ఆమె వెంబడి తల్లిఉంది. "నీవు నిద్రపట్టించుకోవాలి. తెల్లారేవరకూ ఓపికపడితే పెద్ద డాక్టరమ్మను పిలి

విస్తానన్నారు కదా ? కొంచెం ఓర్చుకోవాలి" చెమటపట్టిన ఆమె ముఖాన్ని బట్టతో తుడిచింది తల్లి.

"అదేమిటి ? ఫాన్ నడుస్తుంటేకూడా చెమటపడుతున్నదా ?" రూబీ సిస్టర్ అడిగింది.

"అవునమ్మా, బాధతో విలవిల్లాడిపోతున్నది."

"మదర్‌కి చెప్తాను. ఏదయినా మందివ్వమంటే ఇస్తాను."

"అడుగమ్మా, బాధతో మెలికలు తిరుగుతోంది."

సిస్టర్ రూబీ వెనక్కు తిరిగింది.

ఆమె అసిస్టెంటు మరొకలైను గదుల్లోని రోగులను చూడటానికి వెళ్ళింది.

అదొక పెద్దహాలు. దానికి రెండువైపులా పదేసి గదులున్నాయి. హాలు దాటితే పెద్ద వరండా. దానిలోకి తలుపులున్న గదులు ఇటూ అటూ ఉన్నాయి. ఒకదానిలో నర్సు ఉంటుంది. మరొకదానిలో మందులు ఇతరవస్తువులు ఉంటాయి.

బొంబాయివంటి మహానగరంలో ఆ పెద్ద వీధిలో ఇల్లు దొరకటం చాలా కష్టం. కాని ఆయింటిని డాక్టర్ సైమన్ కొన్నాడు. నూటఏభయి సంవత్సరాల నాటి మాట. ఈ మధ్యకాలంలో ఆ వీధిలో ఎన్నోమార్పులు జరిగాయి. వీధివెడల్పు చెయ్యటానికి ఎన్నో ఇళ్ళను పడగొట్టారు. కాని, రూబీ నర్సింగ్‌హోముకు ఇంటి ముందర చాలాస్థలం ఉంది. రోడ్డు వెడల్పు చేసినప్పుడల్లా ప్రహరీగోడను వెనక్కు జరుపుతూ వస్తున్నారు.

డాక్టరుసైమన్ సైన్యంలో పనిచేసి రిటైరయిన తరువాత ఆ యింటిని కొని ప్రాక్టీసు చెయ్యటం మొదలుపెట్టాడు. అతడు ఉండగానే కొడుకు అలెగ్జాండరు విదేశాలలో పైచదువులు చదివివచ్చి తండ్రి చేతికింద పనిచేశాడు. అతడి భార్య మార్తా రోగులకు ఎనిస్థీసియా ఇవ్వటంలో (మత్తుమందు)లో శిక్షణపొందింది.

ఆ హాస్పిటల్ ఎప్పుడూ రోగులతో కిటకిటలాడుతూ ఉండేది. దీనికి వెనకగా ఉన్న యింట్లో కుటుంబం ఉండేది. సైమన్ చనిపోయిన తరువాతకూడా ఆ హాస్పిటల్‌కి అదివరలో ఉన్న పేరూ, ప్రతిష్ఠ అధికమయ్యాయి గాని తగ్గలేదు. అలెగ్జాండరు కొడుకు చర్మవ్యాధుల డాక్టరుగా డిగ్రీలుపొంది ఆ హాస్పిటల్లో

పని చేశాడు. అతడి భార్య లిల్లీ పిల్లలడాక్టరుగా అక్కడే పనిచేసింది. వాళ్ళ కూతురు ఎలిజబెత్ ప్రసూతి డాక్టరుగా శిక్షణపొందింది. ఆమె చదువుతూనే తోటి డాక్టర్ని వివాహం చేసుకుంది. ఒక బిడ్డ పుట్టగానే అతడు చనిపోయాడు. చదువు పూర్తిచేసుకుని ఆ బిడ్డను తీసుకుని ఇండియాకి తిరిగివచ్చింది ఎలిజబెత్. ఆ బిడ్డే రూబీ.

రూబీ వైద్యశాస్త్రం చదవటానికి విదేశాలకు వెళ్ళి నర్సింగ్‌కోర్సులో పట్టభద్రయై తిరిగివచ్చింది. ఎలిజబెత్ కొంతకాలంగా డాక్టరుగా ప్రాక్టీసుచెయ్యటం లేదు. అవసరమైనప్పుడు సలహాలిస్తూ ఉంటుంది. రూబీ ఆ హాస్పిటల్‌ని తగు మార్పులుచేసి నర్సింగ్‌హోముగా మార్చివేసింది.

ఇప్పుడది రూబీ నర్సింగ్‌హోమ్.

అక్కడ వైద్యోపచారాలు బాగా జరుగుతాయని ప్రసిద్ధి. పెద్దపెద్ద డాక్టర్లు తమ రోగులను అక్కడే చేర్పించి వైద్యం చేస్తారు. ఎప్పుడు ఏ డాక్టరు అవసరమయినా సిస్టర్ రూబీ టెలిఫోనుచేసి పిలిపిస్తుంది. ఆ నర్సింగ్‌హోములో డబ్బు ఖర్చెక్కువవుతుందనుకునే వాళ్ళుకూడా అక్కడికే వస్తూ ఉంటారు. పనిపాటలు చేసుకునే జనంకూడా "ఆ రూబీసిస్టరమ్మ చేతిలోపడితే ఎటువంటి జబ్బయినా గంటలమీద తగ్గిపోతుందను" కుంటారు.

రూబీ చల్లటిమాట, తీయటి పలకరింపు, ఆ ఓదార్పు సగంజబ్బును తగ్గిస్తాయని వాళ్ళకొక నమ్మకం ఏర్పడింది. ఆ కాంపౌండులో ఒకపక్క గుడిలోని దుర్గామాయి, ఒకపక్క మేరీమాతలకు సాష్టాంగపడి ప్రార్థనలు చేసి నర్సింగ్ హోములో అడుగుపెడతారు రోగులు. తిరిగి వెళ్లేటప్పుడు దణ్ణాలుపెడుతూ వెళ్తారు.

అతడు ఎంతసేపు చూసినా సిస్టర్‌రూబీ రాలేదు. ఓపికతో ఆమెకొరకు ఎదురుచూసి నిద్రకొరిగాడు. ఆ అమ్మాయికి వేడినీళ్ళుపోసిన సంచీతెచ్చి ఇచ్చింది ఆయా. కాపుకుంటూ ఉండగా ఆమెకు నిద్రపట్టింది.

ఐదుగంటలకు నర్సువచ్చి అందరికీ టెంపరేచరు చూసింది. ఆయాలూ, వార్డ్‌బాయ్‌లూ అందరికీ ముఖాలకు నీళ్ళందించారు. పక్కలు దులిపివేశారు. అందరికీ ఒక కప్పు టీ తెచ్చియిచ్చారు.

రూబీ స్నానంచేసింది. తల్లీకూతుళ్ళిద్దరూ బ్రేక్‌ఫాస్టు తీసుకున్నారు. ఎనిమిది గంటలకు రోగులను చూడటానికి ఇద్దరూ వచ్చారు.

"హలో, ఎలా ఉన్నారు? చెయ్యినొప్పి తగ్గిందా?" అడిగింది ఎలిజబెత్.

"నొప్పిచాలా ఎక్కువగా ఉంది. రూబీసిస్టరు మందు ఇస్తానని మళ్ళీ రాలేదు."

"మీరు టీ తాగారా?"

"తీసుకున్నాను."

"బ్రేక్‌ఫాస్టు తీసుకున్నారా?"

"లేదు"

"ఎందుకని?"

"నాకెవరూలేరు బ్రేక్‌ఫాస్టు పంపటానికి. నేనొక మెస్‌లో భోజనంచేసి ఒక రూమ్‌లో ఉండి చదువుకుంటున్నాను."

"ఈ దెబ్బ ఎట్లా తగిలింది?"

"ఇక్కడికి ఫర్లాంగు దూరంలో టెన్నిస్‌కోర్టుంది. అక్కడ నా స్నేహితులతో ప్రాక్టీసు చేయటానికి వచ్చాను. నేను విదేశాలకుపంపే టీమ్‌లో సెలక్టు అయ్యాను. ఇదివరకు మా టీమ్ రెండుసార్లు గెలిచింది."

అంతలో సిస్టర్‌రూబీ ఆ గదిలోకి వచ్చింది. అప్పుడే అతడు టీమ్‌సంగతి చెప్తున్నాడు.

"మిమ్మల్నొకసారి టెన్నిస్ కోర్టులో చూసినట్టు జ్ఞాపకం. నేను ఒకవేళ పొరబాటుపడ్డానా?" అన్నాడు సిస్టర్‌రూబీని చూసి.

ఆమె మొదట నవ్వి తరువాత "అవును" అంది.

"నేను ప్రాక్టీసుచేసి మెస్‌కి వెళ్ళాలా రూమ్‌కి వెళ్ళాలా అని ఆలోచిస్తూ నడుస్తున్నాను. బస్టాపుకు కొంతదూరంలో కట్టెలఅడితీఉంది. నావెనక స్నేహితుడొకడు పరుగెత్తుకుంటూ వచ్చి నా బుజమ్మీద చెయ్యేసి మాట్లాడుతూ నా వెంట

నడుస్తున్నాడు. ఇంతలో అడిటీవచ్చింది. అక్కడ కొన్ని కొండరాళ్ళు కూడా ఉన్నాయి. కనురెప్పపాటులో నేను ఆ రాళ్ళమీదపడి దొర్లి, ఆ మొద్దులమీద పడ్డాను. స్నేహితుడి కోసంచూస్తే అతడు కనబడలేదు. బహుశ ఆ అడిటీవాళ్ళే వాళ్ళబండిలో ఇక్కడికి తీసుకువచ్చి ఉంటారు." తనకు తెలియకుండానే అక్కడికి వచ్చినట్టు చెప్పాడు.

"నేనూ అప్పుడప్పుడు టెన్నిస్‌కోర్టుకు వస్తూ ఉంటాను. బాగారాకపోయినా ఆడుతూ ఉంటాను. నన్ను అక్కడికి రమ్మని ప్రోత్సహించినవాడు వినోద్. అతడు మా యింటికి తరుచుగా వస్తూ ఉండేవాడు."

"అఁ హాఁ, ఆ వినోద్ ఇవాళ నాతో ఆడాడు. అతడే నాతో వచ్చాడు అంతవరకూ."

"నేను బ్రేక్‌ఫాస్టు పంపిస్తాను. కాదు-నేనే తీసుకువస్తాను" అంటూ ఆమె ఐదునిమిషాలలో ట్రేలో పెట్టి తీసుకువచ్చింది.

"మీకెందుకూ ఈ శ్రమ? నాకేదయినా హోటల్‌నుంచి తెప్పించే ఏర్పాటు చెయ్యండి."

"ఇవాళేకాదు మీరిక్కడ ఉన్నన్నాళ్లూ మాయింట్లోనే బ్రేక్‌ఫాస్టు భోజనం టీ వగైరా తీసుకోండి. అన్నట్టు మీపేరు?"

"వికాస్"

ఆమె అంత బలవంతంచేస్తుంటే అతడు కాదనలేకపోయాడు. అతడు తినటం అయేవరకూ ఆమె అక్కడేఉండి ట్రే తీసి ఒక పక్కకు పెట్టింది.

పదిగంటలు కాగానే సర్జన్ వచ్చాడు.

"మిస్టర్, రోడ్డుమీద నడిచేటప్పుడు జాగ్రత్తగాచూసి నడవద్దూ? ఎంత ఫ్రాక్చరయిందో తెలుసా? మూడుముక్కలయింది ఎముక. రోడ్డుమీద లైట్లులేవా ఆ సమయానికి?" మందలించాడు.

"ఉన్నాయి డాక్టర్ నేను మామూలుగా నడుస్తున్నాను. ఏదో నన్ను వెనకనుంచి ఢీకొన్నట్లయింది. తరువాత నేనేమయ్యానో నాకే తెలియదు."

"ఏ ఊరు? ఇక్కడేంచేస్తున్నావు?"

మాది ఆంధ్రప్రదేశ్ ఐ. ఏ. యస్. కోచింగ్ ఇన్స్టిట్యూట్‌లో చదవటానికి వచ్చాను. నాకు టెన్నిస్‌అంటేఇష్టం. విదేశాలకు పంపేటీమ్‌లో సెలక్టయ్యాను. ప్రాక్టీసు చెయ్యటానికి టెన్నిస్ కోర్టుకు వచ్చాను."

"మరి చదువు?"

"సెలవిచ్చారు ఇంటికివెళ్ళకుండా ఇటువచ్చాను."

''రెండిటికీ కుడిచెయ్యి ముఖ్యం. చక్కగా పరీక్షకు చదువుకోక ఇక్కడికి వచ్చి చెయ్యి విరగ్గొట్టుకున్నావు. కొన్ని రోజులయిన తరువాత మళ్ళీ ఎక్సురే తీసి ఎట్లాఉందో చూడాలి. జాగ్రత్తగాఉండు" భుజంతట్టి వెళ్ళిపోయాడు డాక్టరు.

రూబీ డాక్టర్ని పంపించి మళ్ళీ గదిలోకివచ్చి, "నీ సంగతంతా విన్న తరువాత నాకు చాలా బాధకలిగింది. నీ ఆశలూ ఆశయాలు విజయవంతంకావాలని దైవాన్ని ప్రార్థిస్తున్నాను" అంటూ కొంచెం సేపు ఆగదిలో కూర్చుని వెళ్ళింది.

రోజులు మెల్లగా-అతి మెల్లగా గడుస్తున్నాయి.

ఆరోజు వికాస్‌కి తెల్లవారేముందర-అంటే నాలుగు దాటిందేమో - ఎక్కడి నుంచో కూనిరాగం వినిపించింది. అది ఎక్కడినుంచో తెలియక పక్కమీద లేచి కూర్చున్నాడు. ఆరాగం ఒక జోలపాటలాఉంది. వినగా వినగా కళ్ళు మూతలు పడుతున్నట్లనిపించింది. కొంత సేపయిన తరువాత ఆరాగ మాగిపోయింది.

మరునాడుకూడా ఆరాగం వినిపిస్తుందేమోనని నిద్రలోనుంచి లేచి కూర్చున్నాడు. ఆ రాగం ప్రారంభమయి సుమారు అరగంటసాగింది. తరువాత ఆగిపోయింది.

వికాస్‌కి వేళతప్పకుండా బ్రేక్‌ఫాస్టు భోజనం కాఫీ టిఫిన్లు రూబీస్వయంగా తెచ్చిపెడుతోంది. ఇద్దరిమధ్యా స్నేహముకలిసి కబుర్లలోకి దిగుతోంది.

''సిస్టర్ రూబీ రోజూ తెల్లవారుఝామున ఎవరోపాడుతున్నట్టు వినిపిస్తుంది. సంగీతంవచ్చిన రోగులెవరయినాఉన్నారా ఇక్కడ? సందేహిస్తూనే అడిగాడు.

"సంగీతమా? నర్సింగ్ హోములో? రోగులు సంగీతం పాడగలిగితే ఇక్కడికెందుకువస్తారు? రోగుల సంగీతం మూలుగే."

"నాది కలకాదు-భ్రమ అంతకంటేకాదు నిజం. రోజూ నేను వింటున్నాను ఆవేళకు నేను లేచి కూర్చుంటున్నాను. మొదట జోలపాటగా ఉంటుంది. అది ఆగిపోయిన కొంతసేపటికి విషాదరాగం నాకు స్పష్టంగా వినబడుతున్నది."

"నిజంగానా? నేనెప్పుడూవినలేదే? తెల్లవారుఝామున సంగీతం పాడే దెవరబ్బా ఇక్కడ?"

"నిజం నాకు ఇప్పుడు సరిగ్గా ఆవేళకు మెలకువవస్తోంది. ఆ రాగం వినాలన్న కుతూహలంతో లేచి కూర్చుంటాను. దాని మహిమవేమిటోగాని అది ఆగిపోగానే గుండె నీరు గారినంతపనవుతుంది. ఇంక-ఆతరువాత నిద్రపట్టటం కష్టమే."

"ఇదిగో చూడు ఈ హాస్పిటల్ కాంపౌండులోనే వెనక మేము ఉంటాము. మధ్యలో సర్వెంటుక్వార్టర్సు ఉన్నాయి. అందరూ పగలంతా కష్టపడి పనిచేస్తారు. అప్పుడప్పుడు రాత్రిళ్ళుకూడా పనిచేస్తారు అటువంటికష్టజీవులు తెల్లవారుఝామున లేచి పాటలు పాడ్తారని నేననుకోను. అది ఏదో భ్రమకు సంబంధించినది."

ఆనాడేమీ మాట్లాడలేకపోయాడు వికాస్. ఆ మరునాడు ఎప్పటిమాదిరిగా ఆ పాట వినబడుతుందనుకుంటే ఎందుకో ఆపాట సమయానికి వినబడలేదు. పాటకోసం ఎదురుచూసిచూసి కన్నుమూశాడు.

ఆ మరునాడూ వినబడలేదు.

ఆపాట ఆవేళకు వినబడకపోతే అతడికెంతో చికాకనిపిస్తుంది. నొప్పి ఎక్కువైనట్లనిపిస్తుంది. కడుపులో బాధగాఉన్నట్టుంటుంది. ఆ చికాకులో ఆనా డతడు పక్కకు తిరగబోయి మంచమ్మీదనుంచి కిందపడి పెద్దకేకపెట్టాడు.

ఆ సమీపంలోఉన్న వార్డుబాయ్‌లిద్దరు అతడిని ఎత్తి మంచమ్మీద పడుకో బెట్టి సిస్టర్ రూబీకి టెలిఫోనుచేశారు. వెంటనే తల్లీకూతుళ్ళిద్దరూ పరుగు పరుగున వచ్చారు.

వికాస్ ఒళ్ళుతెలియకుండా మూలుగుతున్నాడు.

తెల్లవారితేగాని డాక్టరికి ఫోనుచెయ్యటానికి వీలుకాదు. అంతవరకూ అతడు పడేబాధను వాళ్ళు చూడలేకుండా ఉన్నారు.

"రూబీ అతడికి ఒక ఇంజక్షనుఇవ్వు. నిద్రపోతాడు తెల్లవారగానే డాక్టరికి టెలిఫోనుచెయ్యి. ఇప్పుడు మనమేంచెయ్యలేంకదా?" అని ఎలిజబెత్ వెళ్ళిపోయింది.

రూబీ ఇంజక్షను ఇచ్చింది. మెల్లగా దెబ్బతగిలిన చేతిమీద తన చేత్తో రాయటం మొదలు పెట్టింది కుర్చీమీద కూర్చుని.

అతడు క్రమంగా నిద్రలోకి జారుకున్నాడు.

ఆమెకక్కడినుంచి లేవబుద్ధికాలేదు. అతడు ఎడమవైపుకు తిరిగి పడుకున్నాడు. అతడి ముఖమే చూస్తూ కూర్చుంది. ఆమెకు ఆలోచనలు ఎటోపోతున్నాయి.

వినోద్ రౌడీలలో రౌడీ, డబ్బుఆశ కలవాడు. డబ్బు కోసం ఎంతపనైనా చేస్తాడు. కొంతకాలం తనవెంటబడ్డాడు. డాక్టరు సైమన్ ఆస్తికంతకూ తండ్రి తాతల డబ్బుకూ ఏకైక వారసురాలు తనే. ఆ డబ్బు కోసమే తన వెంట తిరిగేవాడు. ఇంతాచేస్తే అతడికి టెన్నిస్ ఆడటంరాదు. దానిపైన ఇష్టంకూడాలేదు. కాని వేళకు హాజరయ్యేవాడు. అలా ఒకనాడు తనకు ఒక క్లబ్బుకు తీసుకెళ్ళి తన స్నేహితులకు పరిచయంచేశాడు. బయలుదేరేటప్పుడు ఒక కూల్‌డ్రింక్ కూడా ఇప్పించాడు. రూబీ కారుడ్రైవ్ చేస్తోంది. కొంత సేపటికి తలబరువుగా ఉన్నట్టూ తల తిరుగుతున్నట్టూ అనిపించింది. స్పీడ్ పెంచి ఎలాగో ఇంటికిచేరింది.

ఆమరునాడు "నేను రానంటూ ఉంటే క్లబ్బుకు తీసుకెళ్ళావు. బలవంతంచేసి కూల్‌డ్రింక్ ఇప్పించావు. నాతలగిర్రున తిరుగుతుంటే ఎట్లాగో ఇంటికి వచ్చిపడ్డాను. ఇంకెప్పుడూ నేనురాను నీతో" అంది నిష్ఠూరంగా.

''ఏం? నేను కూల్‌డ్రింక్ ఇప్పిస్తే తాగకూడదా? నిన్నెంతగా ప్రేమిస్తున్నానో తెలుసా? నీకే నామీద దయకలగటంలేదు."

"నాదయా? నీమీద? అటువంటి ఆశలు పెట్టుకోకు నామీద. నన్ను చూసే ప్రయత్నం కూడా చెయ్యకు. వెళ్ళు" ఆమె టెన్నిస్ కోర్టునుంచి వస్తుంటే వెంటబడినవాడిని విదిలించినట్టు మాట్లాడి గేటువేసి లోపలికి వచ్చేసింది.

అప్పటినుంచీ ఒక గుర్ఖాను పెట్టింది గేటుదగ్గర.

వినోద్‌కి ఒక చెడ్డ అలవాటుంది. ఆ మాట ఎవరయినా అంటే-అతడు తేలిగ్గా తీసుకుంటాడు. పైగా "మీరు ఏ శతాబ్దంలో ఉండి మాట్లాడుతున్నారు?" అని నవ్వేస్తాడు.

అతడు స్కూలుకు వెళ్ళే పిల్లలనూ కాలేజికి వెళ్ళే ఆడపిల్లలను అంగరక్షకుడిలా వెంబడిస్తాడు. వాళ్ళు ఒణికిపోతూ బజారువెంబడి నడుస్తారు. వాళ్ళలో కాస్త నవ్వుతూ మాట్లాడేవాళ్ళను పలకరిస్తూ వెంటనే ఉంటాడు. ఒకటి రెండు రోజులయిన తరువాత-వాళ్ళను ఆ గుంపులో నుంచి విడిపోయి తనను ఒంటరిగా కలిసే వలపన్నుతాడు. వాళ్ళను సినిమాలకు తీసుకువెళ్తానని తిన్నగా క్లబ్బుకు తీసుకెళ్ళి స్నేహితులకు పరిచయంచేస్తూ డ్రింకులిప్పిస్తాడు. గంట గంటన్నర తరువాత వాళ్ళకు మత్తుదిగి లేవగానే "అమ్మాయిలూ! అట్లా నిద్రలుపోయారేం? పొద్దుపోతే మీవాళ్ళేమంటారు? పదండి నేను వెంటవచ్చి పంపిస్తాను మా స్నేహితులు భయపడ్డారు-మీ కేమయిందోనని" అంటూ వాళ్ళ యిళ్ళకు సాగనంపుతాడు. అతడు ఆ తల్లిదండ్రులను నమ్మిస్తాడు, ఆ విధంగా.

అది హాబీ! వింటున్నట్టుగా తల ఊపాడు వికాస్. ఆ పిల్లలు గర్భస్రావాల కోసం ఇక్కడికి వస్తారు. ఒక అమ్మాయి బొంబాయి శివార్లలో ఉంటుందట. ఆమె లోకల్ ట్రైన్‌లో వచ్చి ఇక్కడ పెయింటింగ్‌లో డిప్లొమా చేస్తున్నది. ఆ అమ్మాయే ఒక అపూర్వ కళాఖండంలా ఉండేది. ఆమె ఈ నర్సింగ్‌హోమ్ మీదుగా నడిచివెళ్ళేది. ఆమె వెంటబడ్డాడు. ఆమెకు పెళ్ళికాలేదు గాని గర్భిణి. ఆమె ప్రేమించినవాడు పరీక్షలయిన తరువాత పెళ్ళిచేసుకుంటానన్నాటడ. అప్పటి వరకు ఈ డిప్లొమా కోర్సుచేస్తానని తల్లితో కాపరం పెట్టింది ఆమె ఒక రోజు భయపడుతూ ఈ నర్సింగ్‌హోమ్‌లోపలికి వచ్చి, ఇదంతా చెప్పి, ఇక్కడ ఉంటానంది. అమ్మా సరేనంది. ఆ తరువాత తల్లికూడా వచ్చింది. అకస్మాత్తుగా ఆమెకు నెలలు నిండకుండానే కాన్పు వచ్చింది. అంత చక్కని బిడ్డను నేను ఎప్పుడూ చూడలేదు. తల్లి ఒడిలో పెట్టుకుని కూర్చుంటే ఆ దృశ్యం చూడ ముచ్చటగా ఉండేది. అటువంటి దృశ్యాన్ని నేను ఫోటో తీసి భద్రపరచుకున్నాను. వారంరోజులు గడిచాయోలేదో బిడ్డ చనిపోయింది. ఆ బిడ్డకోసం ఆమె ఏడ్చిన ఏడుపు వింటే రాళ్ళు కరుగుతాయనిపించేది. ఆమె అంటే నాకెంతో ఇష్టం. నేను

చాలా సేపు ఆ గదిలోనే ఉండేదాన్ని. ఆమె ఆ చనిపోయినపాపకు జోలపాట పాడేది. ఆ తరువాత ఏడ్చేది. నేను ఆ పాటను ఆమె ఏడుపునూ టేపుచేసి ఉంచు కొన్నాను. ఆమె జ్ఞాపకార్థం, కొన్ని రోజులకు ఆమె చనిపోయింది. ఆ అమ్మాయి ఇక్కడుందని వినోద్ అంచనా. ఆమె చనిపోయిందని చెప్పినా వినిపించుకోడు. అప్పుడే పోలీసుకు రిపోర్టుచేసి రైడ్ చేయించాడు" రూబీ కళ్ళు తుడుచుకుంది.

వికాస్ చేతిని ఎక్సరేతీశారు. విరిగిన ఎముకలను సర్ది మళ్ళీ ప్లాస్టర్ వేశారు.

"ఇప్పుడు కొత్తగా మా నర్సుమీద అతడి కన్ను పడ్డది. ఆమెను చూశారుగా? వయసులో చిన్నది. ఆమె యింటినుంచి వస్తూ పోతూఉంటే ఇలాగే వెంటబడి మాటకలపాలని ప్రయత్నిస్తున్నాడట. ఆమె ద్వారా మీరెట్లా ఉన్నది తెలుసు కుంటున్నాడు. "రూబీ అతడి గదిలోకి వచ్చి చూస్తుందా?" అని అడుగుతాడ"ట. అసలు టెన్నిస్‌కోర్టులో మనిద్దరినీ చూసినప్పటినుంచీ తనకు ప్రత్యర్థి కాగలడని మిమ్మల్ని తోసి ఉంటాడు, వినోద్. అతడిని ఆ దేవుడు ఎట్లా సృష్టించాడా అని అని నాకు ఆశ్చర్యం కలుగుతూ ఉంటుంది."

అతడు అంతబాధలోను నవ్వాడు.

"అవును ఎవర్నయినా అడగండి ఈమాటే అంటారు. కాని-అదేంచిత్రమో-అతడిని ఎవరూ శిక్షించలేకుండా ఉన్నారు.

"ఎందుకని?"

"పట్టుబడకుండా పనిచేస్తాడు మాటలు చూస్తే తియ్యటిమాటలు."

"రూబీసిస్టర్! నాకొకసారి ఆ టేపు వినిపించరూ?" ప్రాధేయపడ్డాడు.

"మీరు వింటే మనసు పాడయిపోతుంది."

"పోనీ ఒకసారి ఆఫోటో అయినా చూపించండి. తృప్తిపడతాను?"

"ఆ ఫోటో చూస్తే మీకు నిద్రపట్టదు""

"ఎందుకని?"

"అబ్బా. నేను చెప్పకూడదనుకున్నదంతా నాచేత చెప్పిస్తున్నారు."

"అదేమిటి? నాకుచెప్తేఏం? నేనొక పేషంటును. చేతి ప్లాస్టరు తీసిన

తరువాత వెళ్ళిపోతాను అంతేగా ఆ తరువాత ఈ నర్సింగ్‌హోమ్‌తో నాకు పని అయిపోతుంది."

"అలోగా? ప్లాస్టరు తీసిన తరువాత సర్జను ఏమంటాడో? ఫిజియోథెరపీ తీసుకోమంటే? ఉండద్దూ అప్పుడు?"

అతడు గాఢంగా నిట్టూర్చాడు.

"నా జీవితం కూడా ఇక్కడే అంతమవుతుందేమో?" అందుకే ఒకసారి ఆ పాట విని. ఆఫోటో చూస్తానంటున్నాను. ఇది నా ఆఖరికోరిక."

"ఆ టేపువిని ఆఫొటోచూచిన తరువాత మీలో మానసికంగా ఏదయినా మార్పువస్తే అది శరీరమ్మీద కనబడుతుంది. సర్జను నన్ను కోప్పడితే?"

"అటువంటిదేమీఉండదు. నేను నిర్వికారంగాచూస్తాను. అట్లాగే వింటాను ప్రామిస్."

రూబీ వెళ్ళి ఆరెండింటికీ తీసుకువచ్చి ముందు ఫొటో చూపించింది. మళ్ళీ అతడు అడగకుండానే టేప్‌వినిపించింది. అతడు మాట్లాడకుండా విన్నాడు ఫొటో చూసినవెంటనే కళ్ళుమూసుకున్నాడు.

"అట్లాఉండాలి గుడ్‌పేషంటంటే" వాటిని లోపల భద్రంగా దాచివచ్చింది. అప్పటికే అతడికళ్ళు నీటికుండలయ్యాయి. తలగడాఅంతా తడిసిపోయింది.

"అదేమిటి ఆ కన్నీరు? ప్రామిస్ చేశారుగా? నిజంచెప్పండి మీకు ఆఫొటోకు ఏమయినా సంబంధముందా? లేకపోతే మీరింతబాధపడరు నాకు నిజంచెప్పాలి "

"ఏంలేదు పాపం-బిడ్డను పోగొట్టుకున్నదికదా అని బాధకలిగింది అంతే "

"కాదు ఆమె చనిపోయిన తరువాత ఆమెతల్లి వెళ్ళిపోతూ "అమ్మాయి బట్టలు ఆ పెట్టెలోఉన్నాయి. ఎవరికయినా ఇచ్చెయ్యమ"ని చెప్పి వదిలిపెట్టింది. ఆ పెట్టెలోఉన్నదొక ఫొటో. ఆమె ఒక యువకుడితో తీయించుకున్న ఫొటోఅది దానిలో ఉన్నయువకుడు మీరుకాదా చెప్పండి?" అతడి చేతినిరాస్తూ అన్నది.

"నాకొక నిద్రమాత్రఇస్తారా?" జాలిపుట్టేటట్టు అడిగాడు.

"ఇస్తాను కాని భోజనంవేళకు లేచేటట్టుగా చిన్నడోస్ ఇస్తాను."

తలఊపి తీసుకున్నాడు కాని ఆ డోస్ చాలలేదు. అతడు మౌనంగా కళ్ళు మూసుకుపడుకున్నాడు. భోజనంవేళకు రూబీ బలవంతమ్మీదలేచి తినీతిననట్టు తిన్నాడు. మళ్ళీ కళ్ళు మూసుకుని పడుకున్నాడు.

అతడితో కబుర్లుచెబుతూ పనిచేసే రూబీలో మాంద్యం ప్రవేశించింది. రెండు పిలుపులకుగాని పలకదు. ఆ రెండోరోజుకూడా ఇద్దరికీ మౌనంగాగడిచింది. ఇద్దరికీ భోజనాలు సరిగాలేవు. వికాస్‌గదిలోకి నర్సువచ్చి పనులుచేసి పోతున్నది.

వారంరోజులు గడిచినతరువాత డాక్టరు వచ్చి ప్లాస్టరు తీసేశాడు. ఎక్సురే తీసి చూస్తే బాగానేఉంది. "నీవు యింటికివెళ్ళచ్చు. మెల్లగా ఎక్సర్‌సైజుచేస్తూఉండు నీ పరీక్షకు అడ్డంరాదు. నీకేదయినా బాధగాఉంటే వచ్చి చూపించుకో" మని చెప్పాడు.

వికాస్ నర్సుచేత రూబీకి ఒక ఉత్తరంరాసి పంపించాడు.

ప్రియమైన రూబీ సిస్టర్‌కి,

ఇన్నిరోజులనుంచీ నా మనసును కబుర్లతో ఆహ్లాదపరచిన నీవుసప్త సముద్రాలు ఘోషిల్లుతున్నట్టు నాహృదయం ఘోషిల్లుతున్న సమయంలో నన్ను దూరంచేశావా? చల్లటి నీమాటతో నా మనసును శాంతపరచవలసిననీవు, కంటి చూపునుకూడా కరవుచేశావా? ఈ దీనుడేమపరాధంచేశాడని నాకీశిక్ష వేశావు?

డాక్టరు నన్ను ఇంక వెళ్ళమని చెప్పాడు. రేపు పొద్దున వెళ్ళిపోతున్నా.

ఒక్కటంటే ఒక్కసారి నాకంటికి కడసారిగా కనబడి వెళ్ళమని కోరు తున్నాను.

ఇట్లు
అంధకారంలోఉన్న వికాస్.

ఒకగంట తరువాత రూబీ జబ్బుపడిలేచిన మనిషిలా మెల్లగావచ్చి పక్కకు తిరిగి పడుకున్న వికాస్ చేతిమీద చెయ్యివేసి మంచంపక్కనఉన్న కుర్చీలో కూర్చుంది.

ఆ చల్లటిచెయ్యి తగలగానే ఆమెవైపుకు తిరిగేడు కళ్ళుతెరచి. ఆమె తల వంచుకుని కూర్చుంది. అతడు ఆమె ముఖంలోకే చూస్తున్నాడు.

నోటితో మాట్లాడుకోవటంలేదు వాళ్ళిద్దరు. మనసులు ఒకదానినొకటి ప్రశ్నించుకుంటున్నాయి. ఒకదానినొకటి సమాధాన పెట్టుకుంటున్నాయి. ఊరట చెంది రాజీకివచ్చినట్లు "రూబీ సిస్టర్" అన్నాడు వికాస్.

కళ్ళెత్తి చూసింది.

"నీవప్పుడు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేదనేనా నీకు నామీద కోపం.

ఆమె మాట్లాడలేదు.

"ఆ ఫోటో నాది, ఆమెపేరు మధురిమ. ఆ పాటపాడినదీ తరువాత ఏడ్చినదీ నా హృదయాన్ని మధురంచేసిన మధురిమ. పెళ్ళిచేసుకోవాలని వాగ్దానాలు చేసుకున్నాం. ఇంతలోకి విదేశాలకు టెన్నిస్‌టోర్నమెంటు సందర్భంలో వెళ్ళవలసి వచ్చింది. నేను మళ్ళీ వచ్చేసరికి మధురిమ తల్లితో ఇక్కడికి వచ్చినట్టుంది. నాకు కనబడలేదు. నేను ఐ.ఏ.ఎస్. కోచింగ్‌కని మళ్ళీ ఇక్కడికివచ్చాను. మళ్ళీ విదేశాలకుపంపే టోర్నమెంటులో సెలక్టు అయ్యాను. మధురిమను చూడందీ ఏపనీ చెయ్యననుకున్న నేను ఆమెకోసం వెతికివెతికి వేసారిపోయాను. ఆబాధలోనే మళ్ళీ టోర్నమెంటులో చేరాను. ఐ. ఏ. ఎస్. కోచింగ్ కూడా కాలక్షేపంకోసమే. మా ఇద్దరి ప్రేమఫలాన్ని కంటితో చూడలేదన్నబాధ - మధురిమను చూడలేక పోయానన్న వ్యధతో నీ ప్రశ్నలకు జవాబివ్వలేకపోయాను.

ఇదీ నా గత చరిత్ర. ఇప్పుడు నేను-నాఅన్నవాళ్ళులేని ఏకాకిని. వ్యధిత హృదయంతో అలమటించిపోయే అనాథను.

ఇంక నాకు జీవితంలో ఏంమిగిలింది?

నా రూమ్‌కి రేపు వెళ్ళిపోతున్నాను. కడసారిగా నిన్ను చూడాలనీ నీ ఊరడింపుతో సెలవు తీసుకుందామన్న ఆశతో నీకు ఉత్తరంరాశాను అంతే."

రూబీ కుర్చీలోనుంచి దిగ్గునలేచి అతడి హృదయానికి హత్తుకుపోయింది. మళ్ళీ మనసులు మాట్లాడుకోవటం మొదలుపెట్టాయి.

"పాలరాతితో చెక్కినట్టున్న మధురిమలా నేను అందంగా లేకపోవచ్చు. కాని నాహృదయంలో టెన్నిస్ కోర్టులోనే నిన్ను ప్రతిష్ఠింప చేసుకున్నాను. నన్ను

విడిచి వెళ్ళకు. వెళ్ళకు నీ మాటలకోసం-నీ చూపులకోసం పరితపించి పోతున్నాను వికాస్! నిన్ను చూడనిదీ బ్రతకలేను."

"నేనూ అంతే. నా హృదయమంతా ఆవరించుకున్నావు. నిన్ను విడిచి నేను ఉండలేను, ఉండలేను."

మనసులు రోదిస్తున్నాయి.

కొంతసేపటికి తెప్పరిల్లిన రూబీ సిస్టర్ "వికాస్, మెల్లగాలేపి కూర్చోబెడతాను. కాఫీ టిఫిన్ తీసుకునే వేళయింది తెస్తాను."

కాసేపటిలో కాఫీ టిఫిన్ తీసుకువచ్చి తనచేత్తో నోటికందించింది రూబీ.

ప్రసన్నుడైన వికాస్ మనసూ-కడుపూ నిండాయి.

కాని-ఒక కంటిలో నీరు- ఒక కంటిలో ఆనందం. ద్వంద్వాతీతుడు కాలేక పోతున్నాడు కేవలం మానవుడైన వికాస్.